
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 107 వ భాగం

## పురంజనోపాఖ్యానం; వేనుడి చరిత్ర - 3

వేనుడు రాజయ్యాడు కదా, జనాలని ఏడిపించుకు తినడం మొదలైంది. మంత్రులకీ మిగతావారికీ భయం. ఇప్పుడు ప్రస్తుత పరిస్థితుల్లో మనకీ ప్రపంచంలో జరుగుతున్నట్టే ఉంది అప్పటి కథ కూడా. తెలియకపోయి ఫలనా ఆయన, ఏదో సహాయం చేసి మన జీవితాలని బాగుచేస్తాడనుకుని ఆయన్ని ఎన్నుకుని గెలిపించాం. ఆయన హయాం లో బాగా ఏమిటి గానీ మునపటికన్నా అధ్వాన్నంగా ఉంది పరిస్థితి. ఏం చేస్తే మంచిది?

చ. అరయ నరాజకంబగు మహాభయముం దొలఁగింపఁగోరి యి
ట్లెఱుఁగక యీ యనర్హుని మహీపతిఁ జేసిన యట్టి దోషముం
బరువడిఁ జెందె దుగ్ధరస పానమునం బరివృద్ధినొందు న
య్యురగము భీతి పోషకుని నొందిన రీతి ననర్థహేతువై. [4-416]

క. మునుకొని సునీథ గర్భం
బున జనియించియు స్వభావమున దుర్జనుఁడై
యెనయఁ బ్రజాపాలనమున
కును బాల్పడి ప్రజల మన్నిగొనఁ జొచ్చెఁగదే. [4-418]

అరాజకం అనే మహా భయంకరమైన దోషాన్ని తొలగించడానికి ఈ వేనుణ్ణి – అనర్హుడిని, రాజుగా చేసాం. దాంతో పాముకి పాలుపోసినట్టైంది (అది పాలు పోసినవాణ్ణే కరవకుండా ఉంటుందా?). ఇదో అనర్థం కొత్తగా వచ్చినది.

ఈ పద్యంలో యురగము అంటే పాము; మహీపతి – భూమికి పతి (రాజు). వీడి స్వభావం వల్ల దుర్జనుడిగా తయారయ్యాడు – మన రాణీగారికి పుట్టినప్పటికీ.

వ. అదిగాన నీ వేనుండు పూర్వంబున జ్ఞాన సంపన్నులచేత రాజుగాఁ జేయంబడియెఁ; గావున నిట్టివాని మన మందఱమును గూడి ప్రార్థింతము; లోకరక్షణార్థం బగుటఁ దద్దోషంబు మనల స్పృశింపదు; సమీచీనోక్తులం జేసి వీని ననునయింప వాని గ్రహింపకుండెనేని మున్న లోకధిక్కారాగ్నిసందగ్ధుం డగు వీని మన తేజోమహాగ్నిచేత భస్మీ భూతుంజేయుద" మని యాలోచించి గూఢమన్యు లగుచు వేనునిం గదియం జని యతని కిట్లనిరి. [4-419]

అయితే మేలించి కీడెంచాలి కనక ముందో మాట చెప్పి చూద్దాం. అలా మాట చెప్పడం లోక కళ్యాణానికి కనక దాని వల్ల దుర్జనుడి ఇలా అడగవల్సి వచ్చిందేం అనే మాట/దోషం మనమీదకి రాదు. మాట వినకపోతే వీణ్ణి భస్మం చేయడం తప్ప వేరు దారి లేదు. ప్రస్తుత రాజకీయాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది గమనించండి. మనిషిని చంపరు కానీ చెత్త పాలకులని దింపేసి మరొకణ్ణి ఎక్కిస్తారు.

వ. ఇట్లనిరి "నరేంద్రా! యే మొక్కటి విన్నవించెద; మవధరింపుము; పురుషులకు వాఙ్మనఃకాయ వృత్తుల వలన నాచరించు ధర్మంబు సమస్త లోకంబులను విశోకంబులం జేయు; నసంగు లయిన వారికి మోక్షంబు నిచ్చును; అట్టి ధర్మంబు ప్రజలకు క్షేమకారణంబు గావున నీ యందుఁ జెడకుండుం గాక"యని పలికి మఱియు "ధర్మంబు నాశంబు నొందిన నైశ్వర్యంబుచే రాజు విడువంబడు" నని చెప్పి వెండియు నిట్లనిరి "దుష్టచిత్తులగు నమాత్యులవలనను దస్కరులవలనను బ్రజలు నాశంబు నొందకుండ రక్షించుచు యథాన్యాయంబుగ వారలచేఁ గరంబు గొనుచు నుండు మహీపతి యిహపరసౌఖ్యంబుల నందు; నదియునుం గాక యెవ్వని రాష్ట్రంబున నే పురంబున యజ్ఞేశ్వరుం డయిన పురుషోత్తముండు నిజవర్ణాశ్రమోచితం బయిన ధర్మంబు గల వారిచేత యజియింపంబడు, నట్టి నిజశాసనవర్తి యగు రాజు వలన సర్వభూతభావనుండును, మహాభాగుండును, భగవంతుండు నగు సర్వేశ్వరుండు సంతుష్టుం డగు; నట్టి సకల జగదీశ్వరుం డైన సర్వేశ్వరుండు సంతోషించిన రాష్ట్రాధిపతికి సర్వసౌఖ్యంబులుఁ బ్రాపించు; లోకపాలకు లగువారు సర్వేశ్వరునికొఱకు బలిప్రదానంబులు చేయుదురు; సమస్తలోకదేవతాయజ్ఞాది సంగ్రహుండును, వేదమయుండును, ద్రవ్యమయుండును, దపోమయుండు నగు నారాయణుని విచిత్రంబులైన యజ్ఞంబులచేత యజనంబుచేసిన నీకు నభయం బగు; మోక్షంబునుం గలుగుం; గావున నీ రాజ్యంబున మఖంబులు చేయు మని యాజ్ఞాపింపుము; నీ దేశంబునఁ జేయంబడిన యజ్ఞంబులచేత హరికళాయుక్తంబు లగు దేవగణంబులు స్విష్టంబులై, తుష్టంబు లగుచు

భవదీయవాంఛితార్థంబుల నిత్తురు; గావున దేవతాతిరస్కారంబు నీకు యుక్తంబు గాదు; వేదచోదితంబు లగు ధర్మంబులం దాసక్తుండవు గ"మ్మనిన వేనుం డిట్లనియె. [4-421]

అందరూ కలిసి రాజు వేనుడి దగ్గిరకి వెళ్ళి చెప్పారు – ధర్మం అనేది మోక్షం ఇవ్వనూ గలదు లేదా పాటించకపోతే నాశనం చేయనూ గలదు. అందువల్ల పాలకుల వల్ల వల్ల అధర్మం జరక్కుండా చూసే బాధ్యత రాజుదే. అందువల్ల నీ ఇష్టం వచ్చినట్టూ ఉండడం మంచిది కాదు. ఇందులో మొదట చెప్పిన విషయం కృష్ణుడు రాయబారానికి వెళ్ళినప్పుడు చెప్పినదే. తిక్కన మహాభారతంలో ఏమంటున్నాడో చూడండి.

ఉ. సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱినదైన యవస్థదక్షు లె
వ్వార లుపేక్షచేసి రది వారలచేటగుఁ గాని ధర్మ ని
స్తారకమయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్ [ఉ. పర్వం తృ. ఆశ్వా.]

సారమైన ధర్మం పాపం చేతా, ఏ మాలిన్యమూలేని సత్యం, బొంకు చేతా గట్టెక్కలేక చెడిపోయే దశకి వచ్చినప్పుడు సమర్థులైనవారు ఉపేక్ష చేస్తే అది వారికి చేటు తెస్తుంది. కాని ధర్మాన్ని గట్టెక్కించేది సత్య శుభస్థితిని యోగ్యులకు సమకూర్చేదీ అయిన దైవము ఎల్లవేళలా ఉంటుంది. ధర్మం చెడిపోదు కాని ఉపేక్షగా చూస్తూ ఊరుకుంటే భీష్ముడికీ, ద్రోణుడికీ అయినట్టే అవుతుంది.

భగవంతుడైన కృష్ణుడు ఇంత చెప్పినా ఏం చేసారు వీళ్లు? ఏ ఒక్కరూ కూడా ధుర్యోధనుణ్ణి ఆపలేకపోతారు. అదే ఉపేక్ష అంటే. పరశురాముణ్ణి నిలువరించిన భీష్ముడు యుద్ధం మొదలౌతుంటే సిగ్గూ అదీ లేకుండా అంటాడు , తన దగ్గిరకి ఆశీర్వాదం కోసం వచ్చిన ధర్మరాజుతో – వీళ్ల ఉప్పు తిన్నాను కనక వీళ్ళ తరపున పోరాడవల్సి వస్తోంది అని. ఎంతటి హీనమమైన చేతకాని మాట అది? కురువృద్ధుడి నోట్లోంచి రావాల్సిన మాటేనా?

ఈ కథలో వేనుడు రాజయ్యాక కళ్ళు నెత్తిమీదకి వచ్చాయి కదా అందువల్ల ఇప్పుడు (ప్రస్తుతం మన పాలకులలాగే మాట్లాడుతున్నాడు).

క. మునులార! మీర లిప్పుడు
నను నీ గతిఁ బడుచుఁదనమునం బలికితి; రై
నను నది యధర్మ; మందుల
నెనయఁగ ధర్మమనఁ గలదె? యెచ్చటనైనన్. [4-422]

చ. ఎనయఁగ జారకామిని నిజేశుని ట్రుచ్చిలి జారపూరుషుం
దనపతిఁ గాఁ దలంచు గతిఁ దద్దయు మూఢమనస్కులై తన
ర్చిన నరపాలరూపము ధరించిన యీశ్వరు నన్నెఱుంగ క
న్యుని భజియింప మీ రిహపరోన్నత సౌఖ్యము లంద రెన్నఁడున్. [4-424]

మీరు చెప్పినదాంట్లో అసలు ధర్మం అనేది ఎక్కడుంది? నేను రాజుని. మీకు బుర్ర లేక భగవంతుడే రాజుగా నా రూపంలో జనించిన నన్ను – వేనుణ్ణి – పరమేశ్వరుడిగా గుర్తించలేకపోతున్నారు. నా విష్ణు: పృధ్వీ పతిః అని జనవాక్యం అంటారు కదా. అంటే విష్ణువు అంశ లేనివాడు రాజు కాలేడుట. నేనే భగవంతుణ్ణి అని మీకు అర్ధం కావడం లేదు, ఎందుకంటే మీరందరూ కూడా మూఢ మనస్కులు. ప్రస్తుత రాజకీయాల్లో ఉన్నాయన ఇదే మాట – చెప్పిన అబద్ధమే చెప్తూ ఇంకా అధికారం కోసం పాకులాడ్డం గమనించండి – ఈ ఎన్నికలన్నీ తప్పు. నేనే నెగ్గాను అంటూ జనాలని ఉసిగొల్పి కొంతమంది చచ్చినా తనకేం పట్టనట్టు చూస్తూ కూర్చున్నాడు కదా? తన స్వంత కూతురే మా నాన్న ఓడిపోయేడు నిజమే అని చెప్తూంటే – ఆవిణ్ణి, అల్లుణ్ణీ, ఇంకా అతి దగ్గిరవారినీ కూడా వదులుకోవడానికి సిద్ధంగానే ఉన్నాడు కానీ తాను మాత్రం మహా మేధావి, అసలు సాక్షాత్తూ భగవంతుడి స్వరూపమే అనుకోవడం. ఇదే వేనుడు కూడా చేసేది. ఈ ప్రపంచంలో వింత ఏమిటంటే ఈ వేనుడి వంటి రాజులకై తందాన తాన అనే తొత్తులు చాలా మంది ఉన్నారు – వాళ్ళు చెప్పేది నిజం అని నమ్ముతూ.

క. హరి హర హిరణ్యగర్భ
స్వరధీశ్వర వహ్ని శమన జలధిపతి మరు
న్నరవాహన శశి భూ రవి
సురముఖ్యులు నృపశరీర సూచకు లగుటన్. [4-426]

క. పరికించి నను భజింపుఁడు
ధరణీశుఁడు సర్వదేవతామయుఁ డగు; మ
త్పర ముడుగుఁడు; నాకంటెను
బురుషుఁడు మఱియెవ్వఁ డగ్రపూజార్హుఁ డిలన్? [4-427]

ఇంకా చెపుతున్నాడు వినండి. రాజు శరీరంలో బ్రహ్మ, హరిహరాదులు, వాయువు, అగి, ఇంద్రుడు (స్వరధీశ్వర – స్వరానికి అధిపతి), యముడు (శమన – సర్వావయవాలని శమింపచేసేవాడు) ఉంటారు. అందువల్ల రాజు సర్వదేవతామయుడు కిందే లెక్క. నాకంటే ఉత్తముడు, అగ్ర పూజార్హుడు ఇంకెవరున్నారు? అందువల్ల అన్నీ మానేసి నన్నే పూజించండి.

వ. అదిగాన మీరు నాయందు బలివిధానంబులు చేయుం;"డని పాప కర్ముండు, నసత్ప్రవర్తకుండు, నష్టమంగళుండు, విపరీతజ్ఞానుండు నగు వేనుండు పండితమాని యగుచుం బలికి మునుల వచనంబులు నిరాకరించి యూరకున్న; నమ్మునులు భగ్నమనోరథులై తమలో నిట్లని "రీ దారుణకర్ముం డయిన పాతకుండు హతుం డగుం గాక; వీఁడు జీవించెనేని వీనిచేత నీ జగంబులు భస్మంబులు గాఁగల; విది నిశ్చితంబు; దుర్వృత్తుం డగు వీడు మహారాజ సింహాసనంబున కర్హుండు గాఁడు; వీఁడు మున్ను నే సర్వేశ్వరు ననుగ్రహంబున నిట్టి విభూతి యుక్తుం డయ్యె నట్టి యజ్ఞపతి యైన శ్రీవిష్ణుని నిందించుచున్నవాఁడు; గావున నిర్లజ్జుండైన హరినిందకుని హననంబు చేయ వలయు" నని ముని లుద్యోగించి యాత్మప్రకాశితంబైన క్రోధంబునం జేసి హుంకారమాత్రంబున నా యీశ్వరనిందాహతుం డగు వేనునిం బొలియించి; రంత. [4-428]

ఇంత చెప్పాక రాజు ఇలా అనేసరికి వాళ్ళకి మండుకొచ్చింది. వాళ్ళ మనసుల్లో 'ఇంతటి దారుణాలు చేసే దశకి దిగజారిన ఈ వేనుడు చావాలి గాక, వీడు కానీ బతికితే మొత్తం జగత్తు అంతా నాశనం అవడానికి కారణం అవుతుంది. ఇటువంటివాడు మహారాజ సింహాసంమీద కూర్చోడానికి అర్హుడు కాదు. ఇలా అనేసరికి ఆ క్రోధాగ్నికి వేనుడు చచ్చిపోయాడు. అంటే వాణ్ణి సింహాసనం మీదనుంచి దించారు, ఆ తర్వాత ఎలాగో పోయాడు అనుకుందాం. అయన కథ అలా ముగిసింది. ఈ దరిద్రం వదిలింది అనుకుంటే ముందు జరిగేవి మరింత దరిద్రంగా ఉంటాయి కథలో.

క. అరసి సునీథయు శోకా
తుర యై తన సుతుఁడు దనువుఁ దొఱఁగినఁ దదనం
తరమునను యోగశక్తిం
బరువడి నిజ తనయు తనువుఁ బరిపాలించెన్. [4-429]

తల్లికి తెల్సింది ఈ వేనుడు, తన కొడుకు ఇలా చావడం. ఆవిడకీ తెలుసు కొడుకు ఇలాంటివాడని కానీ చేసేదేవుంది? తండ్రి చేయగలిగినంత చేసి అడవుల్లోకి పోయాడు కొడుకుని మార్చలేక. తాను చెప్పినది కొడుకు వినడం మానేసి చాలా కాలం అయింది. కొడుకు శరీరాన్ని మాత్రం ఎందుకో తన యోగ శక్తి చేత పాడైపోకుండా దాచి ఉంచింది.

ఇప్పుడు రాజ్యనికి రాజు లేడు కదా? అరాజకం మొదలౌతుందా మళ్ళీ? అసలు వేనుణ్ణి రాజుగా చేయడమే అరాజకం రాకుండా చూడ్డానికి కదా? కానీ వేనుడి గుణాలవల్ల ఆయన్ని సింహాసనం ఎక్కించినవారే కిందకి దించారు సింహాసనం మీదనుంచి. కిం కర్తవ్యం? అది ముందు వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS